www.mb9news.in
R.NO : TS-11-0011054

# మన భద్రాద్రి న్యూస్

మన అక్షరం ....... ప్రజల ఆయుధం

డిజిటల్ తెలుగు దినపత్రిక

సోమవారం 28, ఏప్రిల్ 2025

## మంత్రి తుమ్మలతో జార్ఖండ్ వ్యవసాయ శాఖ మంత్రి భేటీ



2 లో..

# కేసీఆర్ తన మనసంతా విషం నింపుకొని బయటకొచ్చారు

మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు



2 లో..

హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 27

కేసీఆర్ తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ను విలన్ గా చూపించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆయన మనసంతా విషం నింపుకొని వరంగల్ సభలో మాట్లాడారని మంత్రి ఆరోపించారు. తెలంగాణ తెచ్చిన కాంగ్రెస్ విలనా అని ఆయన నిలదీశారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీగా పుట్టి, ప్రాంతీయ పార్టీ మారి, జాతీయ పార్టీగా మార్చుకున్నారని ఆయన ఎద్దేశా చేశారు. కల్వకుంట్ల కుటుంబానికి వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ వల్ల ధనిక రాష్ట్రం.. అప్పుల రాష్ట్రంగా మారిందని మంత్రి పొంగులేని శ్రీనివాస్ అన్నారు.

## ఎన్డీఎస్ఏ రిపోర్టులో సంచలన విషయాలు..!

– డీపీఆర్ కు విరుద్ధంగా బ్యారేజీల నిర్మాణాలు




2 లో..

## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..!

– కర్రెగుట్టల్లో భారీ బంకర్ స్వాధీనం



2 లో..

## కేసీఆర్ మాటల్లో అది మాత్రం క్లియర్‌గా అర్థమైంది..!

– కేసీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ మంత్రుల కౌంటర్ అటాక్



2 లో..

హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 27

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క స్పందించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. అధికారం కోల్పోయిన నియంత ఆవేదన ఎలా ఉంటుందో.. కేసీఆర్ ప్రసంగం అలాగే ఉందని విమర్శించారు.

# వందకు వందశాతం జరిగేది అదే..!

– డైరీల్లో రాసుకోండి అంటూ కేసీఆర్ మార్క్ వార్నింగ్



2 లో..

**మన భద్రాద్రి వెబ్ డెస్క్, ఏప్రిల్ 27 :** ఎల్కతుర్తి వేదికగా జరుగుతోన్న బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కాంగ్రెస్‌పై కేసీఆర్ రెచ్చిపోయారు. తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని ఫైర్ అయ్యారు. అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి దొంగనాటకాలు ఆడారని సీరియస్ అయ్యారు. దళితబంధుతో రూ.12 లక్షలు, కల్యాణ లక్ష్మితో లక్ష రూపాయలతో పాటు తులం బంగారం, రూ.4 వేల పెన్షన్, ఆడబిడ్డలకు స్కూటీలు వంటి అనేక పనికిమాలిన హామీలు ఇచ్చి ప్రజలను నిండా ముంచారని అన్నారు. అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెస్ మించినోళ్లు ప్రపంచంలోనే ఎవరూ లేరని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# ఎన్డీఎస్ఏ రిపోర్టులో సంచలన విషయాలు..!

హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 27

డీపీఆర్‌లో పేర్కొన్న ప్రాంతాలను పక్కన పెట్టి, మరోచోట మేడిగడ్డ, సుందిల్ల బ్యారేజీలను నిర్మించారు. దీంతో ఆయా బ్యారేజీల్లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని ఈ మధ్య ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన రిపోర్టులో పేర్కొన్నారు. అయితే ఎవరు చెబితే డీపీఆర్‌లో పేర్కొన్న ప్రాంతం నుంచి మరోచోట బ్యారేజీలు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారో అంతుచిక్కని ప్రశ్నగా మారింది. కొత్త ప్రాంతాల్లో బ్యారేజీలు కట్టేముందు కనీసం జియోలజికల్, జియో టెక్నికల్ టీమ్స్ తో అక్కడ ఎలాంటి భూ పరీక్షలు నిర్వహించలేదని రిపోర్టులో పేర్కొన్నారు.

**- ఇష్టం ఉన్న చోట నిర్మాణాలు**

బ్యారేజీలను నిర్మించే ముందు నదిలో ఎక్కడ నిర్మాణం చేస్తే బాగుంటుందనే అంశంపై అన్ని రకాలుగా పరిశోధనలు చేసిన తరువాతే సాంకేతిక నిపుణులు నిర్ణయం తీసుకుంటారు. కానీ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం విషయంలో అప్పటి ప్రభుత్వం ఇష్టానుసారంగా నిర్ణయం తీసుకున్నది. దీనితో డీపీఆర్ లో పేర్కొన్న ప్రాంతాల్లో కాకుండా తమకు ఇష్టం ఉన్న చోట బ్యారేజీలను నిర్మించారన్న




విషయం ఈ మధ్య నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన రిపోర్టుల్లో వెల్లడైంది.

అన్నారం బ్యారేజీని డీపీఆర్ లో పేర్కొన్న ప్రాంతంలో కాకుండా 2.2 కిలో మీటర్ల కింద నిర్మించారు. నది ప్రవాహం అధికంగా ఉంటే చోటుకు షిఫ్ట్ చేశారు. దీనితో బ్యారేజీలో నీటి నిలువ సామర్థ్యం 11.81 టీఎంసీల నుంచి 13.56 టీఎంసీలకు పెరిగింది. అలాగే సుందిళ్ల బ్యారేజీని కూడా 5.40 కిలో మీటర్ల కింద నిర్మించారు. దీనితో బ్యారేజీ పొడవు ఒక మీటర్ తగ్గింది. నీటి నిలువ సామర్థ్యం 3.27 టీఎంసీలకు పెరిగింది. డీపీఆర్ లో పేర్కొన్న ప్రాంతాల్లో కాకుండా ఇతర చోట నిర్మాణాలు చేయడం వల్లే ఆ రెండు బ్యారేజీల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయని అభిప్రాయానికి ఎన్డీఎస్ఏ అభిప్రాయపడింది.

**- ఎవరు చెబితే ప్రాంతాన్ని మార్చారు..?**

డీపీఆర్ లో పేర్కొన్న ప్రాంతంలో కాకుండా మరోచోట ఆ రెండు బ్యారేజీలను నిర్మించాలని ఎవరు నిర్ణయం తీసుకున్నారు..? ఇంజనీర్లే సొంతంగా నిర్ణయం తీసుకున్నారా..? లేకపోతే ఎవరైన చెబితే బ్యారేజీలను నిర్మించారా..? అనే అంశాలపై ఆసక్తికర చర్చ జరుగుతున్నది. అయితే ఎన్.డీ.ఎస్.ఏ రిపోర్టులో "ఓ మీటింగ్ లో బ్యారేజీ నిర్మాణ ప్రాంతాలను మార్చాలి" అని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. అయితే ఆ మీటింగ్ లో ఎవరు తుది నిర్ణయం తీసుకున్నారోనని విషయంపై స్పష్టత ఇవ్వలేదు. ఒకవేళ డీపీఆర్ లో పేర్కొన్న ప్రాంతంలో కాకుండా మరోచోట బ్యారేజీ కట్టాలంటే ఆ ప్రాంతంలో జియోలజికల్, జియో టెక్నికల్ టీమ్స్ ను సంప్రదించాలి. వారిచ్చే రిపోర్టుల ఆధారంగా అక్కడ పనులు మొదలుపెట్టాలి. కానీ, ఎవరిని సంప్రదించకుండానే ప్రస్తుత ప్రాంతాల్లో పనులు చేపట్టినట్లు ఎన్.డీ.ఎస్.ఏ వెల్లడించింది.

# మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..!

మన భద్రాద్రి వెబ్ డెస్క్, ఏప్రిల్ 27

కేంద్ర బలగాలు చేపట్టిన ఆపరేషన్ కర్రె గుట్టల్లో కీలక అడుగు ముందుకుపడింది. ఐదు రోజుల సెర్చ్ ఆపరేషన్లో మావోయిస్టుల బంకర్ ను గుర్తించారు. మావోయిస్టుల కంచుకోట అయినా కర్రెగుట్టల్లో నక్సలైట్ల భారీ బంకర్‌ను భద్రతా దళాలు గుర్తించాయి. దాదాపు వెయ్యి మంది ఉండేలా నిర్మించిన భారీ గుహను భద్రత దళాలు కనిపెట్టాయి. ఈ గుహలో నీటి సౌకర్యం కూడా ఉన్నట్లు గుర్తించారు. భద్రతా బలగాల రాకను ముందే పసిగట్టిన మావోయిస్టులు అక్కడి నుంచి ఎస్కేప్ అయ్యారు. కాగా కర్రెగుట్టల్లో అనేక గుహలు ఉండటంతో భద్రతా బలగాలకు సవాళ్లు ఎదురవుతున్నాయి. తెలంగాణ, ఛత్తీస్గఢ్ సరిహద్దులో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. గుహ విజువల్స్ను భద్రతా బలగాలు విడుదల చేశాయి.

ఇలాంటి గుహలు కర్రె గుట్టల్లో అనేకం ఉండటంతో భద్రతా బలగాలకు సవాళ్లు ఎదురవుతున్నాయి. దీంతో మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న కర్రెగుట్టలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్‌ను కంటిన్యూ చేస్తున్నాయి. భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య పరస్పర కాల్పులతో కర్రెగుట్టలు దద్దరిల్లుతున్నాయి. తుపాకీ తూటాల మోతతో కర్రెగుట్టల సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురైతున్నారు. 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని అంతం చేయాలని కంకణం కట్టుకున్న కేంద్ర ప్రభుత్వం.. ఇందు కోసం ఆపరేషన్ కగార్ చేపట్టింది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ ముమ్మరంగా సాగుతోంది. ఈ క్రమంలోనే తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో మావోయిస్టు పార్టీ కీలక నేత హిడ్మాతో పాటు మరో వెయ్యి మందికి పైగా నక్సలైట్లు ఉన్నట్లు భద్రతా దళాలకు నిఘావర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో కర్రెగుట్టలో ఐదు రోజుల నుంచి కేంద్ర, రాష్ట్ర బలగాలు కూంబింగ్ చేపట్టాయి. తెలంగాణ-ఛత్తీసగఢ్-మహారాష్ట్ర మూడు వైపుల నుంచి కర్రెగుట్టలను భద్రతా దళాలు చుట్టుముట్టాయి. హిడ్మాతో పాటు మరికొందరు కీలక నేతలే లక్ష్యంగా భద్రతా దళాలు ముందుకు సాగుతున్నాయి. ఈ క్రమంలో భద్రతా దళాలు, మవోయిస్టుల మధ్య భీకర ఎదురు కాల్పులతో కర్రెగుట్టలు తుటాల మోతతో దద్దరిల్లుతున్నాయి.శనివారం భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర కాల్పుల్లో 28 మంది నక్సలైట్లు హతమైనట్లు సమాచారం. దీనిపై అధికారులు, ప్రభుత్వం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్, తెలంగాణా సరిహద్దు కర్రెగుట్టల్లో యుద్ధ మేఘాలు అలుముకున్నాయి. కాగా కర్రెగుట్టలో మర్ని డంపులు, మావోయిస్టుల రహస్య స్థావరాలు, ప్రింటింగ్ ప్రెస్తో పాటు గుట్టల్లో వైద్య విభాగం కూడా పనిచేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. కర్రెగుట్టలు భద్రతా దళాలలకు చిక్కితే తెలంగాణ, ఛత్తీస్గఢ్ ప్రాంత మావోయిస్టులు కీలక స్థావరాన్ని కోల్పోయినట్లే ననే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలోనే కాల్పుల విరమణకు మావోయిస్టులు ఇప్పటికే మూడు సార్లు ప్రతిపాదనలు పంపినప్పటికీ ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదు. కేవలం ఆఫరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను ఏరివేయడమే లక్ష్యంగా ఈ దాడులు సాగుతున్నాయని పౌరహక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. నక్సల్స్ ఏరివేత పేరుతో మానవ హత్యలకు పాల్పడటం సరికాదని వారంటున్నారు.

ఇక ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉండటంతో కర్రెగుట్టలో ఆపరేషన్ చేపట్టిన కేంద్ర బలగాలు నీరసించిపోతున్నాయి. కర్రెగుట్టల మధ్యన భారీ అడవుల్లో నీరు దొరకక భద్రత దళాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి నడక ఒకవైపు.. చెమటలు, ఉక్కబోతతో ఇబ్బందులకు గురవుతున్న జవాన్లు డీహైడ్రేషన్ కు గురవుతున్నట్లు సమాచారం. తెలంగాణ వైపు నుంచి హెలికాప్టర్ ద్వారా బలగాలకు నిత్యావసర వస్తువులు, తాగునీరు, ఇతర సామగ్రిని ఎప్పటికప్పుడు పంపుతున్నా.. ఛత్తీస్గఢ్ వైపు ఆ తరహా సరఫరాకూ ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సమాచారం. ఎండ వేడి. తాగేందుకు నీరు లేకపోవడంతో చాలామంది జవాన్లు వడదెబ్బకు గురయ్యారు.

# కేసీఆర్ మాటల్లో అది మాత్రం క్లియర్‌గా అర్థమైంది..!

ముందు కల్వకుంట్ల కుటుంబంలోని చీలికలు, పేలికలు సరిచేసుకోవాలని సూచించారు. కేసీఆర్ మాటల్లో ఆ బాధ కూడా కనిపించిందని అన్నారు. పది నెలల్లో 59,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్ కూతురు మంచి మంచి కార్లలో తిరుగుతుంది.. మా పేద ఆడబిడ్డలు ఆర్టీసీ బస్సుల్లో తిరగకూడదా? అని అడిగారు. ఆర్టీసీల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తే కేసీఆర్ ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. దేశంలో పోలీసులను కేసీఆర్ వాడుకున్నంతగా ఎవరూ



వాడుకోలేదని అన్నారు. 60 వేల కోట్ల కరెంట్ బిల్లుల బకాయిలు పెట్టి.. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి ఇవాళ గొప్పలు చెప్పుకున్నాడని ఎద్దేవా చేశారు.బీఆర్ఎస్ హయాంలో కనీసం ధర్నాలు కూడా చేసుకోనీయలేదని గుర్తుచేశారు. ఎల్కతుర్తిలో రైతుల పంటపొలాల్లో సభ పెట్టి.. కాలవలు పూడ్చారని కీలక ఆరోపణలు చేశారు. అసెంబ్లీలో సొల్లు కబుర్లు చెప్పుకుంటున్నారు అంటూ.. తెలంగాణ అసెంబ్లీని కేసీఆర్ అవమానించారని సీరియస్ అయ్యారు. కేసీఆర్‌కు అసెంబ్లీకి వచ్చే అర్హతే లేదని మండిపడ్డారు. అసెంబ్లీలో సొల్లే మాట్లాడుకుంటుంటే.. మరి నీ కొడుకు, అల్లుడ్ని ఎందుకు పంపిస్తున్నామని మండిపడ్డారు. సోనియా గాంధీ లేకపోతే తెలంగాణే లేదని.. ఆమె రాష్ట్రం ఇచ్చింది కాబట్టే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారని.. ఆ విషయం గుర్తు పెట్టుకోవాలని సూచించారు.

## మంత్రి తుమ్మలతో జార్ఖండ్ వ్యవసాయ శాఖ మంత్రి భేటీ

హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 27

జార్ఖండ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శిల్పి నేహా తెర్కే ను ఆదివారం హైదరాబాద్ లోని తాజ్ కృష్ణ హోటల్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మర్యాద పూర్వకంగా కలిశారు. శిల్పి నేహా తెర్కే ఈ నెల 30వ తేదీ వరకు తెలంగాణ లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఫిష్ ఫార్మ్, ఎన్ఎంఆర్ఐ, ఎన్ఎఫ్‌డిబీ , అలాగే ఐఐ ఎంఆర్‌సంబంధిత సమావేశాలలో ఆమె పాల్గొననున్నారు. శిల్పి నేహా తెర్కే తో భేటీ అయిన అధికారులలో రఘునందన్ రావు ఏపీసీ అండ్ సెక్రటరీ (ఏ అండ్‌సీ), అలాగే డైరెక్టర్ హార్టికల్చర్ యాస్మిన్ పాషా ఉన్నారు.

## కేసీఆర్ తన మనసంతా విషం నింపుకొని బయటకొచ్చారు

మొదటి పేజీ తరువాయి

80 వేల పుస్తకాలు చదివిన జ్ఞానంతో కేసీఆర్ మంచి సూచనలు ఇస్తాడేమో అనుకున్నామన్నారు. రైతులు వరి వేస్తే ఉరే అని తన ఫామ్ హౌస్లో 100 ఎకరాల్లో వరి పండిచుకున్నాడని ఆయన అన్నాడు. 10 ఏళ్లలో మీరు చేసిన ఘనకార్యాలపై అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధమా అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. కేసీఆర్ సీఎం గా ఉన్నప్పుడు ఏనాడు కేసీఆర్ సెక్రటేరియేట్ కు రాలేదని అన్నారు.

## వందకు వందశాతం జరిగేది అదే..!



మొదటి పేజీ తరువాయి

ఎన్నికల వేళ రాష్ట్రంలో ఎక్కడికి వెళితే అక్కడ ఆ దేవుడి మీద ఒట్టు వేసి దేవుళ్లను కూడా మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోంది. ఈ ఏడాదిన్నరలో ఏం వెలగబెట్టారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో బంగారం లాగా ఉన్న తెలంగాణలో మళ్లీ పదేళ్ల కిందటి పరిస్థితులు వచ్చాయని అన్నారు.

నా కళ్ల ముందే మళ్లీ తెలంగాణ ఇలా మారుతుంటే తట్టుకోలేకపోతున్నానని ఆవేదన చెందారు. తులం బంగారం రాలేదు. ఇంటింటికీ మంచినీళ్లు రాలేదు. ఆర్టీసీల్లో మహిళల మధ్య గొడవలు సృష్టించి తెలంగాణను మళ్లీ కకావికలం చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో భూముల ధరలు అద్భుతంగా ఉండేవని, ఏడాదిలోనే అంతా తలకిందులు చేశారని మండిపడ్డారు. పదేళ బీఆర్ఎస్ పాలనలో ఎక్కడో ఉన్న తెలంగాణను చాలా ముందకు తీసుకెళ్లిపోయాం. పదేళ్లలో అద్భుతమైన పనులు చేసి చూపించాం, ఎన్నో రంగాల్లో తెలంగాణను నంబర్‌వన్ చేశాం, చెరువుల నిండా నీళ్లు, రికార్డు స్థాయిలో పంటలు పండించాం. తెలంగాణలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసుకున్నాం. అద్భుతమైన తెలంగాణను తయారు చేసుకున్నామని అన్నారు. 7,500 కొనుగోలు కేంద్రాలు పెట్టి ధాన్యం కొనుగోలు చేశాం. మిషన్ భగీరథ, కేసీఆర్ కిట్స్, కంటివెలుగు, కళ్యాణలక్ష్మీ లాంటి పథకాలు ఎవరూ అడగకపోయినా అమలు చేశాం. ఐటీ రంగంలోకి కొత్తగా 7 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు.

తాము విచక్షణతో పనిచేశాం. రాజశేఖర్ రెడ్డి హయాంలో తీసుకొచ్చిన ఆరోగ్య శ్రీ ని అలాగే కొనసాగించామని అన్నారు. ఇలా పనిచేయడం చేతగాక హైడ్రా అనే ఒక దరిద్రాన్ని తీసుకొచ్చి ప్రజలను ఏడిపిస్తున్నారని మండిపడ్డారు. హెచ్‌సీయూ భూములు అమ్ముకుంటున్నారు. అసలు ఏ భూములు అమ్మాలి.. ఏ భూములు అమ్మకూడదో విచక్షణ ఉండాలని సూచించారు. వందకు వందశాతం మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అవసరమైతే డైరీల్లో రాసుకోండి అని సూచించారు. పోలీసులు కూడా జాగ్రత్తగా ఉండాలని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అత్యుత్సాహం ప్రదర్శించొద్దని సూచించారు. ఇక నుంచి ఊరుకునే ప్రసక్తే లేదని, నేను కూడా రేపటి నుంచి బయల్దేరుతా.. ఒక్కొక్కరి సంగతి చూస్తా అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# కర్రెగుట్టను చుట్టుముట్టిన సైనిక బలగాలను వెంటనే వెనక్కి రప్పించాలి

- ఆదివాసీలపై హత్యాకాండను ఆపాలి
- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ





టేకులపల్లి, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 27

గత మూడు రోజులుగా ములుగు ప్రాంతంలో 200 కిలోమీటర్ల విస్తరించి ఉన్న కర్రెగుట్టను 20వేల సైనిక బలగాలు చుట్టుముట్టి జల్లెడ బడుతున్నారని, ఆదివాసీలను, మావోయిస్టులను పదుల సంఖ్యలో బూటకపు ఎన్కౌంటర్ల పేరున చంపివేస్తున్నారని వస్తున్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. కర్రెగుట్ట పరిసర ప్రాంతాల్లో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. తక్షణమే కర్రెగుట్టను మోహరించిన సైనిక బలగాలు వెనక్కి రావాలని, ఆదివాసి ప్రజలపై, మావోయిస్టులపై దాడులను ఆపాలని ప్రజా ప్రయోజనాలు, దేశ ప్రయోజనాల రీత్యా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో వెంటనే శాంతి చర్చలు జరపాలని సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం టేకులపల్లిలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ మాట్లాడుతూ.. ఆదివాసి ప్రజల హత్యాకాండ ను సాగిస్తున్న ఆపరేషన్ కగార్ ను తక్షణమే నిలిపివేయాలని, శాంతి చర్చలకు వస్తామని ప్రకటనలు చేస్తున్న మావోయిస్టులను పట్టుకొని కాల్చి చంపడం చట్టవిరుద్ధమని వారు అన్నారు. కార్పొరేట్ శక్తుల కోసం, అడవులను తాకట్టు పెట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను సాకుగా చూపించి అడవిని నమ్ముకొని బతుకుతున్న ఆదివాసీలను అడవుల రక్షణకు పోరాడుతున్న ఆదివాసులకు తోడుగా ఉన్న వారిని నక్సల్స్ పేరుతో ఎన్కౌంటర్లు చేస్తుందని వారన్నారు.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక వైఖరిని ప్రజలు, ప్రజాస్వా మికవాదులు, బుద్ధిజీవులు ఖండించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పి వై ఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్, మండల కార్యదర్శి తోటకూరి సతీష్, సిపిఐ ఎంఎల్ నాయకులు బిచ్చ, ఐఎఫ్టియు నాయకులు బోడ మంచా, మేకల వినోద్, ఆటో వర్కర్ సీనియర్ నాయకులు సురేష్, మజ్ను, ప్రశాంత్ పాల్గొన్నారు.

# జిఎం ఆఫీసుల ముందు ధర్నాను జయప్రదం చేయండి

- హెచ్.ఎం.ఎస్, ఐఎఫ్టియు, టియుసిఐ, జేఏసీ




ఇల్లందు, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 27

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 29న సింగరేణి వ్యాప్తంగా అన్ని జిఎం ఆఫీసుల ముందు ధర్నాలను విజయవంతం చేయాలని జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఇల్లందు సి హెచ్ పి లో కోల్ ట్రాన్స్పోర్ట్ కార్మికులతో ఐఎఫ్టియు ఇల్లెందు ఏరియా కమిటీ అధ్యక్షులు డి.మోహన్ రావు అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో సింగరేణి కాలరీస్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు అనుబంధం) రాష్ట్ర నాయకులు ఎండి. రాసుద్దీన్, తోడేటి నాగేశ్వరరావు, కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచడంలో కోల్ ఇండియా ఒప్పందాలు అమలు చేయడంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. 2012 జె.బి.సి.సి.ఐ లో కాంట్రాక్టు కార్మికుల వేతనాలు నిర్ణయించినప్పటికీ సింగరేణి యాజమాన్యం నేటికీ అమలు చేయడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. 2022 సెప్టెంబర్ లో జరిగిన 18 రోజుల సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేసారు. మేడే సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపునకు సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని వారు డిమాండ్ చేసారు. కావున సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 29న సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు ఇల్లందు ఏరియా జిఎం ఆఫీస్ వద్ద జరుగు ధర్నాను కార్మికులు సంపూర్ణంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరాటి వెంకటేశ్వర్లు, మోటార్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు ఎస్కే.యాకూబ్ అలీ, మోరే వెంకటేశ్వర్లు, డీ.లాలు, పి.రమేష్, బి. బాలు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- 139వ మేడే ను జయప్రదం చేయండి
- హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొక్కు సారంగపాణి






ఇల్లందు, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 27

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్టియు అనుబంధ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొక్కు సారంగపాణి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 139వ మేడేను జయప్రదం చేయాలని కోరుతూ ఐఎఫ్టియు జాతీయ కమిటీ ముద్రించిన గోడ పత్రికలను ఆదివారం ఇల్లెందు మండల పరిధిలోని కొమరారం, పోలారం, భద్రుతండ, బొంబాయి తండా గ్రామాలలో హమాలీ ముఠాల వద్ద ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటిన నిత్యం బరువులు మోసే హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. మేడే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని 139వ మేడేలో కార్మికులు సంపూర్ణంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హమాలీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పందిర్లపల్లి వీరన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా నాయకులు తొగర సామెల్, హమాలీ సంఘం నాయకులు వాంకుడోత్ హచ్చ, జీవన్, ఇరుప నరేష్, నాలి సురేష్, పందిర్లపల్లి శ్రీను, బానోతు కిషన్, లక్ పతి, రమేష్, మంగీలాల్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల కట్టడాలను పరిశీలించిన ఎమ్మెల్యే కోరం





ఇల్లందు, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 27

ఇల్లందు మండలం, పూబల్లి పంచాయతీలో పైలెట్ ప్రాజెక్టు కింద 83 ఇల్లులు మంజూరు చేయడం జరిగినది. ఇందిరమ్మ ఇల్లుల లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ నిర్మాణ పనులు పరిశీలించిన ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని చెప్పారు. బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వెంటనే లక్ష రూపాయలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని పేర్కొన్నారు. వీలైనంత తొందరగా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులు పూర్తి చేయాలని లబ్ధిదారులు దగ్గరుండి మరి పరిశీలించి నాణ్యతగా కట్టుకోవాలని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, మాజీ ఎంపిటిసి పూణెం సురేందర్, శివ, బానోత్ శారదా, నరసింహారావు, ధనుంజయ్, చీమల బక్కయ్య, జోగ శ్రీకాంత్, అధికారులు ఏఈ డేవిడ్, సెక్రటరీ బాలకృష్ణ, గ్రామ ప్రజలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఛలో వరంగల్ బీఆర్ఎస్ సభకు భారీగా తరలివెళ్లిన బీఆర్ఎస్ కార్యకర్తలు

టేకులపల్లి, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 27

హనుమకొండ జిల్లా, ఎల్కతుర్తి లో జరుగుతున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆదివారం టేకులపల్లిలో ఉన్న 36 పంచాయతీల నుండి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బయలుదేరారు. అందులో భాగంగా సులానగర్ ఉమ్మడి పంచాయితీ నుండి బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు కుమ్మరి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభకు వందల సంఖ్యలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు, అభిమానులు ముందుగా బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసి, ఎవరు ఏలుతున్నారో తెలంగాణ, ఎవరి పాలయ్యిందిరో తెలంగాణ, జై బిఆర్ఎస్ అంటూ నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ రజితోత్సవ సభకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రజా ప్రతినిధులు మాజీ సర్పంచ్ లక్ష్మానాయక్, మాజీ సర్పంచ్ మాలోత్ సురేందర్ నాయక్, చింతల్ లంక మాజీ సర్పంచ్ భూక్య రతన్ లాల్, మాలప్రోలు జయరాజు, గ్రామ అధ్యక్షులు బల్లెం బిక్షం, బోడ రమేష్, బొడ్డు రాము, కొట్టే సురేష్, బల్లెం సురేష్, కేలోత్ రామ్ కుమార్, తోడేటి దావీదు, ఉండేటి ఆగయ్య, కర్లపూడి సుందర్, అశోకు, బానోతు నాను, ఆలోతు అనిల్, ఉమ్మడి పంచాయతీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు బయలుదేరి వెళ్లారు.



# జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పిఓ లకు ప్రత్యేక అభినందనలు

**– గుల్లకారి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుస్మిత కనేరి**





**భద్రాచలం, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 27**

కొండ కోనల్లో నివసించే ఆదివాసి గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు మరియు గిరిజన హస్తకళలను ప్రాచుర్యంలోకి తేవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పిఓ బి.రాహుల్ లను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు గుల్లకారి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుస్మిత కనేరి అన్నారు. ఆదివారం నాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న ట్రైబల్ మ్యూజియంను సందర్శించి మ్యూజియంలో పొందుపరిచిన గిరిజన సాంప్రదాయబద్ధమైన కళాఖండాలను, పెయింటింగ్ చిత్రాలను, పాతకాలపు వస్తువులను, గిరిజన కళాకారులు రూపొందిస్తున్న సాంప్రదాయ హస్త కళాకృతుల తయారీని మరియు తయారుచేసిన బొమ్మలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అధికంగా నివసించే ఆదివాసి గిరిజనుల ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, సంస్కృతి సాంప్రదాయాలు, గిరిజన కళాకారుల నైపుణ్యాభివృద్ధి, వారు తయారు చేసిన కళాకృతులకు మార్కెట్ లింకేజీ, ఉత్పత్తి బ్రాండింగ్, గిరిజన సంపదను ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా చేయడానికి కలెక్టర్, పిఓ ప్రణాళిక బద్ధంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉండటంతో తప్పనిసరిగా ట్రైబల్ మ్యూజియం అభివృద్ధి మరియు గిరిజన హస్తకళల అభివృద్ధితో పాటు సాంప్రదాయం బద్ధమైన ఆదివాసి వంటకాలను త్వరలో మార్గదర్శకాలు రూపొందించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని, పాత తరం ఆదివాసి గిరిజనుల కళాఖండాలను మ్యూజియంలో ఏర్పాటు చేసిన తీరు చాలా అమోఘంగా ఉందని, తప్పనిసరిగా మ్యూజియం అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, ఏపిఎం వెంకయ్య, మ్యూజియం ఇంచార్జ్ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బాంబో యూనిట్ ని సందర్శించిన గుల్లాకారి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుష్మిత కనేరి



**చంద్రుగొండ, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 27**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్.వి.పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో గిరిజన సంప్రదాయ హస్తకళల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా, గుల్లాకారి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శ్రీమతి సుష్మిత కనేరి 2025, ఏప్రిల్ 27న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన చేపట్టారు.ఆమె ముందుగా జిల్లా కలెక్టర్ జితేష్.వి.పాటిల్ ను కలుసుకుని, గిరిజన హస్తకళల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శక ఆదేశాలు తీసుకున్నారు.తదనంతరం చంద్రుగొండ మండలం, బెండలపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన బాంబో యూనిట్‌ను పరిశీలించారు. ఇక్కడి గిరిజన కళాకారులు రూపొందిస్తున్న వెదురు ఆధారిత సంప్రదాయ ఉత్పత్తుల తయారీని, నైపుణ్యాలను ప్రత్యక్షంగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్య, ఏపీఎం (ఫామ్) డిఆర్డీఓ కార్యాలయం, బెండలపాడు బాంబ్ ట్రస్ట్ చైర్మన్ వి.నాగభూషణం, బోర్డు అఫ్ డైరెక్టర్స్ బి.సురేష్, వి.గోవర్ధన్, ఎం.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆ మానసిక రోగులకు దూరంగా ఉండండి..!

**– టీజీఎస్ఆర్టీసీ ఛైర్మన్ వీసీ సజ్జనార్ ఆసక్తికర ట్వీట్**

**హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 27**

సోషల్ మీడియాలో పాపులర్ కావడానికి కొంతమంది తాము ఏం చేస్తున్నామో అనే కనీస జ్ఞానాన్ని కూడా పరిగణలోకి తీసుకోవడం లేదు. తాము చేసే రీల్స్ వల్ల ఎవరికి ఉపయోగపడుతుంది. ఎవరికీ నష్టం చేస్తుందనే కనీస సోయిన మరిచి ప్రవర్తిస్తున్నారు. ఈ క్రమంలో టీజీఆర్టీసీ ఎండీ, ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ సోషల్ మీడియా విషయంలో ఎప్పటికప్పుడు సమజాన్ని అప్రమత్తం చేసే ప్రయత్నం చేస్తుంటారు. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్లపై ఆయన స్పందించిన తీరు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఆయన చేసిన మరో ట్వీట్ వైరల్గా మారింది. సోషల్ మీడియా వేదికగా చాలామంది అసభ్య పోస్టింగులు, డ్రగ్స్, గంజాయి, గన్ కల్చర్, జుగుప్సాకరమైన పనులు చేయడం, న్యూడిటీ, ఫేక్ సమాచారం, ప్రమాదకరమైన బైక్ స్టంట్స్ లాంటి పలు రకాల వీడియోలు షేర్ చేస్తున్నారు. కేవలం లైకులు, వైరల్, పాపులర్ అవ్వడం కోసం ఇలాంటివి ప్రచారం చేస్తున్నారు. ఈ మధ్య ఇలాంటి ఎన్నో సోషల్ మీడియాలో మరింత ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆదివారం టీజీఎస్ఆర్టీసీ ఎండీ, వీసీ సజ్జనార్ మరో ఆసక్తికర ట్వీట్ చేశారు. ఫస్ట్ టైమ్ గంజాయి తాగితే ఎలా ఉంటుందని అని ఇద్దరు యువకులు రీల్స్ వీడియో క్రియేట్ చేశారు. ఆ వీడియోను ఎక్స్ వేదికగా వీసీ సజ్జనార్ పోస్ట్ చేస్తూ ఆయన చేసిన కామెంట్స్ అందరినీ ఆలోజింప జేస్తున్నది. 'పిచ్చి పలు రకాలు.. వెర్రి వేయి రకాలు.. అంటే ఇదే! సోషల్ మీడియాలో పాపులర్ కావడానికి ఎంతకైనా తెగిస్తారా? ఎలాంటి కంటెంట్ చేస్తున్నారో కనీసం సోయి ఉండక్కర్లేదా? ఎంతో మంది యువత భవిష్యత్తు చిత్తు చేస్తున్న నిషేధిత డ్రగ్స్ వీడియోలు చేస్తూ.. సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు.. చెప్పండి? సోషల్ మీడియాకు బానిసై రీల్స్ పిచ్చి పట్టిన ఇలాంటి మానసిక రోగులకు దూరంగా ఉండండి. వ్యూస్, లైక్స్, కామెంట్స్ మాత్రమే వీళ్లకు కావాలి. రాత్రికి రాత్రే పాపులర్ అయ్యేందుకు ఏమైనా చేస్తారు. సమాజం ఎటుపోయిన, ఎవరు ఏమైపోయిన వీళ్లకు సంబంధం లేదు' అని ట్వీట్లో వీసీ సజ్జనార్ పేర్కొన్నారు.



## మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే జారే

**– నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కొరకు వినతి**



**హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 27**

తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డిని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వారి ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలసి అశ్వారావుపేట నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలు వివరించి అభివృద్ధి కొరకు నిధులు కేటాయించవలసిందిగా వినతిపత్రం అందజేయడం జరిగింది. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

## ఈ బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ కు రివార్డు

**– డీజీపీ చేతులు మీదుగా రివార్డు అందుకున్న ఎస్సై రాజ్ కుమార్**

**హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 27**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, ఈ బయ్యారం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై రాజకుమార్ మాదక ద్రవ్యాలు నిర్మూలనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర డిజీపీ చేతుల మీదుగా రివార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై రాజ్ కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు నిర్మూలనలో భాగంగా నాకు అవార్డు రావడం, అవార్డుని తెలంగాణ రాష్ట్ర డిజిపి చేతుల మీద నుంచి అందుకోవటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. అలాగే యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి వారి భవిష్యత్తుకు బాటలు వేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులు మీ మీద పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఈ సందర్భంగా యువతకు సందేశం ఇచ్చారు. ఎస్సై రాజ్ కుమార్ మాదక ద్రవ్యాల నిర్మూలన రివార్డు అందుకున్నందుకు పలువురు ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు జరగనున్న ప్రజావాణి రద్దు

**– జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**కొత్తగూడెం, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 27**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూభారతి చట్టం అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా భూభారతి అవగాహన సదస్సులు నిర్వహించుటలో జిల్లా యంత్రాంగం మరియు అధికారులు నిమగ్నమై ఉన్నందున సోమవారం 28-04-2025 ప్రజావాణి రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలందరూ గమనించి దరఖాస్తులు ఇవ్వడానికి ఐ డి ఓ సి కార్యాలయానికి రావద్దని సూచించారు.

## గిరిజన దర్బార్ కు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలి

**భద్రాచలం, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 27**



సోమవారం నాడు భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని ఆయన తెలుపుతూ సంబంధిత యూనిట్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

# ఉగ్రవాదాన్ని నిర్మూలించాలి

**- సిఐటియు పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు**
**- సిఐటియు ఆధ్వర్యంలో కాశ్మీర్ మృతులకు ఘన నివాళి**



**భద్రాచలం, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 27**
పర్యటకులపై అత్యంత దుర్మార్గంగా కాల్పులు జరిపి మారణహోమం సృష్టించిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సిఐటియు పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు సీనియర్ నాయకులు గడ్డం స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ కార్మిక కూడలి ల వద్ద కాశ్మీర్ మృతులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ నలుమూలల నుండి కాశ్మీర్ అందాలను చూసేందుకు పర్యటకులు వేల సంఖ్యలో వస్తుంటారని అటువంటి సున్నితమైన ప్రదేశాలలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం భద్రతను తగ్గించిందని వారు ఆరోపించారు. పాకిస్తాన్ నుండి తీవ్రవాదులు భారతులకు ప్రవేశించి సుమారు 15 నిమిషాల పాటు కాల్పులు జరిపిన సైనికులు గాని పోలీసులు గాని అక్కడికి చేరుకోలేదు అంటే భద్రత వైఫల్యం ఏ స్థాయిలో ఉందో కొట్టొచ్చినట్టు కనబడుతుందని అన్నారు. తీవ్రవాద ప్రభావిత ప్రదేశాలలో నిఘాను భద్రతను పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనతో కాశ్మీర్లో ఎన్నో వేలమంది ఉపాధి కోల్పోతున్నారని ఉగ్రవాదం ఏ మతంలో ఉన్న దానిని ఎంతమందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఈ సందర్భంగా శరత్ బాబు స్వామిలు స్పష్టం చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉగ్రదాడిలో మృతి చెందిన కుటుంబాలకు సానుభూతిని తెలుపుతూ మృతులకు నివాళులు అర్పించే కార్యక్రమాలు చేపట్టామని అంతేకాకుండా దేశంలో శాంతి నెలకు నేందుకు సిఐటియు అన్ని విధాల కృషి చేస్తుందని అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణ వ్యాప్తంగా అన్ని కార్మిక వాడల వద్ద శాంతి సామరస్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని స్పష్టం చేయగా ఈ కార్యక్రమంలో సిఐటియు కోర్ కమిటీ సభ్యులు పారేలి సంతోష్ కుమార్ చాట శ్రీనివాసరావు చెన్నుపాటి ముఠా సంఘం నాయకులు శ్రీను నరసింహ రావు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభకు కదిలిన గులాబీ దండు

**- గులాబీ మాయమైన కొత్తగూడెం, పాల్వంచ**
**- వనమా రాఘవ ఆధ్వర్యంలో జోరుగా కదిలిన గులాబీ దండు**







**కొత్తగూడెం, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 27**
వరంగల్ బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు కొత్తగూడెం నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేలాదిమంది గులాబీ అభిమానులతో పెద్ద ఎత్తున ప్రదర్శనగా బయలుదేరారు. ఉదయం నుండే వనమా నాయకత్వంలో కొత్తగూడెం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, రెండు పట్టణాలలోని గులాబీ శ్రేణులు ఆ ప్రాంతాల్లోని గులాబీ జెండాలతో పెద్ద ఎత్తున ప్రదర్శనగా వనమా గృహానికి చేరుకున్నారు. వనమా సతీమణి వనమా పద్మావతి బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులతో కలిసి వనమా కి హారతులు పట్టి ప్రదర్శనకు శ్రీకారం చుట్టారు. డప్పు వాయిద్యాలతో వందలాది మంది కళాకారులతో వనమా గృహం నుండి ర్యాలీగా బయలుదేరారు. ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద పెద్ద ఎత్తున బీఆర్ఎస్ సమూహంతో వనమా గులాబీ జెండా ఆవిష్కరించారు. ఇల్లందు క్రాస్ రోడ్ దగ్గర పెద్ద ఎత్తున గులాబీ జెండాతోరణాలతో ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. వనమా రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి బయలుదేరిన ప్రతి బస్సుకు కారుకు జై కేసీఆర్, జై కేటీఆర్, జై వనమా అంటూ స్టిక్కర్లు ఫ్లెక్సీలు అతికించి జై తెలంగాణ అంటూ నినాదాలతో బయలుదేరారు. బీఆర్ఎస్ శ్రేణులతో, కళాకారులతో వనమా స్వయంగా నృత్యం చేస్తూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు.కాబోయే ముఖ్యమంత్రి కేసీఆర్ అంటూ కేటీఆర్, కవిత, హరీష్ రావు లను బీఆర్ఎస్ పార్టీ బుల్లెట్లు అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద మంచినీటి సౌకర్యం, ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన భారీ డీజే కు కేసీఆర్ పైన బీఆర్ఎస్ పార్టీ పైన ఉత్సాహమైన పాటలకు కార్యకర్తలు పోటీపడి నృత్యాలు చేశారు. కొత్తగూడెం, పాల్వంచలో ఎక్కడ చూసినా గులాబీ పండుగ వాతావరణం నెలకొంది. కొత్తగూడెం నుంచి వరంగల్ సభకు 200 కిలోమీటర్ల దూరం ఉండటం వలన ప్రతి బస్సులో మంచినీరు, పులిహోర ప్యాకెట్లు, భోజన సదుపాయాలని వనమా రాఘవ ఏర్పాటు చేశారు.

# శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం



**బూర్గంపహాడ్, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 27**
బూర్గంపాడు మండలం, సారపాక శ్రీ దాసాంజనేయ స్వామివారి ఆలయంలో అమావాస్య సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారికి అభిషేకము, వస్త్రాలంకరణ, అష్టోత్రము, ఆకు పూజ, హనుమాన్ చాలీసా వంటి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. ఆంజనేయ స్వామి ఎంతో శక్తివంతుడని, కోరిన కోర్కెలు తీర్చే ఇష్ట దైవమని ఆయనకు తమలపాకు దండ, సింధూరం సమర్పించితే ఎలాంటి కష్టాలు దరిచేరవు అని భక్తుల విశ్వాసం అని, అలాంటి స్వామి సేవలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ.. శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయం అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేంద్రంగా నిలుస్తుందని, ఈ ఆలయ కేంద్రం ద్వారా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గత రెండు నెలల నుండి ఆలయ పునర్నిర్మాణం జరుగుతున్నది. ఆలయ పునర్నిర్మాణం కోసం సుమారుగా కోటి 50 లక్షలు రూపాయలు ఖర్చు అవుతుందని ఎస్టిమేషన్ చేశారు. కావున భక్తులందరూ ఆలయ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు తమ సహాయ సహకారాలు ధన రూపంలో కానీ, వస్తు రూపంలో కానీ అందించి ఆలయపు నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళా భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పెహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి బాధాకరం

**- కొవ్వొత్తుల నిరసన ర్యాలీని చేసిన సెయింట్ పీటర్ చర్చ్, రుద్రంపూర్ సంఘం**
**- సంఘ కాపరి పి.అనిల్ కుమార్, సెక్రెటరీ రవి రత్నరాజుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**
**- పాల్గొన్న కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు**

**చుంచుపల్లి, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 27**
చుంచుపల్లి మండలం, రుద్రంపూర్ సెయింట్ పీటర్ చర్చ్ సంఘంలో ఆదివారం ఆరాధన అనంతరం సెయింట్ పీటర్ చర్చ్ సంఘ కాపరి పి.అనిల్ కుమార్, సెక్రెటరీ రవి రత్నరాజుల ఆధ్వర్యంలో ఇటీవల జమ్మూ-కాశ్మీర్ పెహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదూల దాడిలో భారతీయులు నేపాల్ దేశస్తులు ఉన్నారని ఉగ్రవాదులు అన్యాయంగా పర్యాటకులను కాల్చి చంపారని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటువంటి దాడులు చాలా బాధాకరమని అన్నారు. ఈ ర్యాలీలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు, సంఘస్థులు తదితరులు పాల్గొన్నారు.

